

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పి వెంకటేశ్వర్లు

# వినాయక నిమజ్జనంలో యువత సామాజిక బాధ్యతతో ఉండాలి

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్, 3 ప్రభాతవార్త:** జిల్లాలో వినాయక నిమజ్జనం సందర్భంగా ప్రజలంతా శాంతి భద్రతలకు సమకరించాలని జిల్లా ఎస్పి ఆర్. వెంకటేశ్వర్లు కోరారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో యువతి, యువకులకు శాంతి భద్రతలపై బందోబస్తుకు సహకరించేందుకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పి పాల్గొని మాట్లాడారు. నేటి యువత అన్ని రంగాలలో తమ దైన ముద్ర వేయడంలో కృషి చేయడం అభినందనీయమన్నారు. వినాయక నిమజ్జనంలో పోలీసు అధికారులకు సహకారం అందించి బందోబస్తు చేయడానికి సామాజిక భాధ్యతతో ముందుకు వచ్చిన యువతను అభినంధించారు. బందోబస్తులో పాటించాల్సి న విధులను వివరించారు. ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ డిఎస్పిఇ టీ మహేష్, శ్రీనివాసులు, సిఐలు అప్పలనాయుడు, శ్రీనివాస్, రాజేశ్వర్‌గైడ్ తదితరులు పాల్గొన్నారు.



హాజరైన యువతి, యువకులు




మహబూబ్‌నగర్ వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట


## పేదలకు ఆసరా కల్పిస్తున్న భరోసా ఫించన్లు



**వెల్దండ, సెప్టెంబర్03, ప్రభాతవార్త:** ఆసరా ఫించన్లు ఎంతో మందికి కొండంత భరోసానిస్తున్నాయని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డిలు పేర్కొన్నారు. వెల్దండ మండల కేంద్రంలోని ఎవీఆర్ గార్డెన్‌లో శనివారం 989 లబ్ధిదారులకు ఆసరా పెన్షన్ కార్డులను ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డిలు పంపిణీ చేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ వృద్ధులు, ఒంటరి మహిళలు, కార్మికులకు ఆసరా పింఛన్లు ఎంతగానో ఉపయోగపడుతుందని వివరించారు. సీఎం కేసీఆర్ ఆపదలో ఉన్న వారికి ఆసరా ఫించన్లు ఇస్తూ ఆదుకుంటున్నారని, ప్రతి ఒక్కరుకు సీఎం కేసీఆర్‌కు అండగా ఉండాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం రాష్టానికి రావాల్సి న నిధులు ఇవ్వకుండా తెలంగాణలో సంక్షేమ పథకాలను అడ్డుకోవాలని చూస్తుందని ఆరోపించారు. సీఎం కేసీఆర్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను సైతం అమలుచేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి సీఎం కేసీఆర్‌యేనని కొనియాడారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ ఛైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్, జెడ్పీటీసీ ధ్యాప విజితారెడ్డి, ఎంపీపీ విజయజైపాల్‌నాయక్, టీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు, వెల్దండ గ్రామ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి, వైస్ ఎంపీపీ శాంతిగోపాల్‌నాయక్, సర్పంచ్‌లు వెంకటేశ్వర్‌రావు, దార్లకుమార్, రామకృష్ణ, రేవతి రాజశేఖర్, అంజ్యానాయక్, కుమార్, మైసయ్యతో పాటు ఎంపీటీసీ గుత్తి వెంకటయ్య, జ్యోతి నిరంజన్, నాయకులు భీమయ్యగౌడ్, అలీ, కాలే వెంకటేష్, జంగిలి యాదగిరి తదితరులు ఉన్నారు.

## ప్రజలందరికి బూస్టర్ డోస్ ఇవ్వాలన్నదే భారత ప్రధాని నరెంద్రమోడీ లక్ష్యం

– కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి డా.మహెంద్రనాథ్ పాండే



**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబర్ 03 ప్రభాతవార్త :** కరోనా బారిన పడకుండా దేశంలోని ప్రజలందరికి బూస్టర్ డోస్ ఇవ్వాలన్నదే భారత ప్రధాని నరెంద్రమోడీ లక్ష్యమని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి డా.మహెంద్రనాథ్ పాండే అన్నారు. శనివారం ఆయన మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పాత పాలమూరు అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కోవిడ్-19 వ్యాక్సినేషన్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. కోవిడ్ నుండి సురక్షితంగా ఉండేందుకు దేశ ప్రజలందరు కోవిడ్ వ్యాక్సినేషన్ బూస్టర్ డోస్‌ను తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా మహబూబ్‌నగర్ జిల్లాలో బూస్టర్ డోస్ వ్యాక్సినేషన్ కార్యక్రమం ఎలా నడుస్తున్నదో తెలుసుకునేందుకు పాత పాలమూరు అర్బన్ సెంటర్ తనిఖీకి వచ్చినట్లు తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లాలో ఇప్పటివరకు 23.96 శాతం మంది ప్రజలు బూస్టర్ డోస్ తీసుకున్నారని, మొదటి, రెండవ డోసులు జిల్లాలో నూటికి నూరుశాతం పూర్తయిందని వైద్యారోగ్యశాఖ అధికారులు వెల్లడించారని తెలిపారు. ప్రతి ఒక్కరు తప్పకుండా బూస్టర్ డోస్ తీసుకోవాలని ఆయన కోరారు. మాజీ మంత్రి డికె అరుణ, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డా. కృష్ణ, డిప్యూటి డిఎంహెచ్‌ఓ డా. శశికాంత్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు తదితరులు మంత్రి వెంట ఉన్నారు.

## డీసీసీబీ బ్యాంకు కుంభకోణంలో పాత్ర ఉన్న ప్రాజప్రతినిధులను సస్పెండ్ చేయాలి..

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.కృష్ణ



**వనపర్తి టౌన్, సెప్టెంబర్ 03 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా సహకార బ్యాంకు(డీసీసీబీ)ఆవరణలోని కమర్షియల్ షాపింగ్ కాంప్లెక్స్ కిరాయిల వ్యవహారంలో పాత్ర ఉన్న ప్రజాప్రతినిధులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా బీజేపీ పార్టీ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్బంగా రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు బి. కృష్ణ మాట్లాడుతూ డీసీసీబీ బ్యాంక్ కమర్షియల్ కాంప్లెక్స్ అడ్వాన్సు వినహాయించి ప్రతి నెల కిరాయిల రూపంలో రెండు లక్షలకు పైగా ఆదాయం వస్తుందని గత కొన్ని సంవత్సరాలుగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల చైర్మెన్, వైస్ చైర్మెన్ లు కిరాయిలను తమ సొంత బ్యాంకు అకౌంట్ లోకి మళ్లించుకొని అక్రమాలకు పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. జాతీయ వ్యవసాయ గ్రామీణాభివృద్ధి బ్యాంకు(నాబార్డ్) నియమావళి ప్రకారం డీసీసీబీ బ్యాంకులు కమర్షియల్ కాంప్లెక్స్ లు నిర్మాణం చేపట్టరాదని తెలిసినా, నిబంధవలు ఉల్లంఘించి కాంప్లెక్స్ నిర్మించారని కిరాయిల రూపంలో వస్తున్న కోట్లాది రూపాయల అక్రమాలకు తెరలేపారని పేర్కొన్నారు. వనపర్తి డీసీసీబీ పరిధిలో ఆరు సింగిల్‌విండోల పాలవర్గాలు అభివృద్ధి పేరుతో లక్షలాది రూపాయల తమ అకౌంట్లోకి జమ చేసుకొని బ్యాంక్ కు టోపి పెట్టారని అన్నారు. నిన్న నాబార్డు అధికారులకు బీజేపీ బృందం ఫిర్యాదు చేయగా స్పందించిన పాలకవర్గ చైర్మెన్ ఒకరు సింగిల్ విండో ఆదాయాన్ని సమకూర్చే ప్రయత్నం చేశామని, కాంప్లెక్స్ కు మరమ్మత్తు చేయించామని చెబుతున్నారు అని ఆయన అన్నారు. షాపింగ్ కాంప్లెక్స్ మధ్య నుండి బ్యాంకు లోకి వెళ్లే దారిలో అక్రమంగా ఒక షటరుని నిర్మించి దుకాణదారితో అడ్వాన్సు, కిరాయి వసూలు చేస్తున్నారని, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం అయ్యి దాదాపు 20 సంవత్సరాలు కావస్తున్న బ్యాంకు ఏటీఎం ఏర్పాటు చేయాలనే ఆలోచన రాని పాలకవర్గాలు బీజేపీ ఫిర్యాదుతో త్వరలోనే ఏటీఎం ఏర్పాటు చేస్తామని చెప్పడం హాస్యప్రదంగా ఉందని విమర్శించారు. శుక్రవారం బీజేపీ నాయకులు కాంప్లెక్స్‌లో కిరాయి ఉంటున్న కిరాయిదారులను కలిసి వాస్తవాలను తెలుసుకునే ప్రయత్నం చేయగా వారు నెల నెల పాలకవర్గాల చైర్మెన్ అకౌంట్లోకి కిరాయి లు వేస్తున్నామని తెలియజేయగా, తెలుసుకున్న పాలకవర్గంలోని కొందరు రాత్రికి రాత్రి దుకాణాదారులపై ఒత్తిడి తీసుకొచ్చి మేము చెప్పినట్లే చెప్పాలని లేదంటే దుకాణాలను ఖాళీ చేయాల్సి ఉంటుందని బెదించారని అంటే బీజేఈపీ నాయకుల ఫిర్యాదుతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెదుతున్నాయని విమర్శించారు. నాబార్డు నియమావళి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మితమైంనందుకు డీసీసీబీ బ్యాంకు కు పెద్ద మొత్తంలో జరిమానా విధించే అవకాశం ఉందని, అక్రమాలు నిజమని తేలితే బ్యాంకు మూసివేయాల్సి న అవకాశం కూడా ఉంటుందని శుక్రవారం నాబార్డు అధికారులు తెలియజేశారని తెలిపారు. ఒకవేళ అదే జరిగితే బ్యాంకును నమ్ముకున్న వేలాది మంది రైతులు నష్టపోతారని పేర్కొన్నారు, ఈ మధ్య కాలంలో మంత్రి నిరంజన్ రెడ్డి కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతు నేను ధరించే చొక్కాగుండీలకు కూడా అవినీతిమరకు అంటకుండా నిజాయితీతో పారదర్శకంగా ఉంటానని పేర్కొన్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కిరాయి వ్యవహారంలో పాలుపంచుకున్న అక్రమా ర్కులను సస్పెండ్ చేసి మంత్రి తమ నిజాయితీని నిరూపించుకోవాలని బీజేపీ నాయకులు కోరారు. మంత్రి నిరంజన్ రెడ్డి స్పందించి అక్రమార్కులను సస్పెండ్ చేయకపోతే త్వరలో డీసీసీబీ సీఈఓ, ప్రాంతీయ సహకార సొసైటీ దృష్టకి తీసుకెళాకతమని, ఈ మధ్యకాలంలోనే కేంద్రంలో సహకార శాఖను ఏర్పాటు చేసి దానికి నేతృత్వం వహిస్తున్న భారత హోంశాఖ మంత్రి అమిత్‌షా దృష్టికి తీసుకెళ్లి నిజాలను బయటపెట్టి అక్రమార్కులకు శిక్షలు పడేదాకా బీజేపీ పార్టీ దశల వారీగా పోరాటం చేస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు సుమిత్రమ్మ, కార్యదర్శి బి.పరుశురాం, జిల్లా అధికార ప్రతినిధి, జిల్లా మీడియా ఇంచార్జ్ పెద్దిరాజు, పట్టణ అధ్యక్షుడు బోయెల్ల రామ్మోహన్, పట్టణ ప్రధాన కార్యదర్శులు సూగూరు రాము, మామిళ్లపల్లి రాయన్న తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ సమస్యలు పరిష్కరించాలి



**మహబూబ్‌నగర్, సెప్టెంబర్, 3, ప్రభాతవార్త:** ఆర్టీసీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం మహబూబ్‌నగర్ పట్టణంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటై 8 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఆర్టీసి కార్మికులకు సిఆర్‌సి అమలు కాలేదని, కొత్త ఉద్యోగాల నియమకాలు జరుగ లేదు, కొత్త బస్సు లను కొనుగోలు చేయాలేదు. ఉన్న జీతాలు నెలకు సక్రమంగా ఇవ్వడం లేదని, కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అవేధన వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కరం కోసం కార్మికులు సమ్మెకు దిగితే టీఆర్ఎస్ ప్రభుత్వం కార్మికులను తొలగించేందుకు బెదిరింపుల చర్యలకు పూనుకుంటున్నారని విమర్శించారు. అడిగే వాడు లేకుండా ప్రతిపక్షాల గోతు నొక్కి ప్రజాస్వామ్యాని టీఆర్ఎస్ ప్రభుత్వం కూని చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్టీసి కార్మికుల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించకపోతే వారికి వెన్నటి ఉండి ప్రభుత్వంపై వత్తిడి పెంచి పరిష్కరించే వరకు కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు లక్ష్మణ్‌యాదవ్, కాంగ్రెస్ మిడియా సెల్ కన్వీనర్ సిహెచ్ బెనహర్ తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వరం టీఆర్ఎస్‌కు ఏటీఎంగా మారింది..!

- కేసిఆర్ కుటుంబ పాలనకు చరమగీతం పాడాలి
- పాలమూరు ఎంపిగా కెసిఆర్ చేసిన హామీలు మర్చిపోయారు.
- పాలమూరు ఎత్తి పోతలకు చేసింది శూన్యం
- తెలంగాణ బిజెపి క్యాడర్‌లో ఉత్సాహంగా ఉంది
- కేంద్ర భారీ పరిశ్రమలశాఖ మంత్రి మహేంద్రనాథ్ పాండే



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి మహేంద్రనాథ్ పాండే

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్, 3, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో కాళేశ్వరం ప్రాజెక్టు టీఆర్ఎస్ పార్టీకి ఏటిఎంగా మారిందని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి మహేంద్రనాథ్ పాండే ఆరోపించారు. శనివారం మహబూబ్‌నగర్ పట్టణంలోని బిజెపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. టీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన హామీలను మర్చిపోయిందన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాలమూరు ఎంపిగా కెసిఆర్ చేసిన వాగ్దానాలు ఏమయ్యనని ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రజలు కెసిఆర్ కుటుంబ పాలనపై విరక్తి చెందారని, అందుకు నిదర్శనం రాష్ట్రంలో వచ్చిన ప్రతి ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్ ఓటమితో నిరుపితం అవుతుందన్నారు. కెసిఆర్ ప్రభుత్వం అన్ని రంగాలలో విఫలమైందన్నారు. పాలమూరు రంగారెడ్డి పథకం కూర్చీ వేసుకుని పూర్తి చేస్తానని ఇప్పటికి చేసింది శూన్యమన్నారు. దళిత బందు పథకం పూర్తి కాలేదన్నారు. కేంద్రం వరి దాన్యం కొనుగోలు చేసేందుకు సమకరించిన కెసిఆర్ ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు కేంద్రానికి వ్యతిరేకంగా నిరసనలు తెలుపుతూ, రైతుల దాన్యం కొనుగోలు చేయకుండా అన్యాయం చేశారని, కొంత మంది రైతుల ఆత్మహత్యలకు కారణమయ్యాయని అరోపించారు. తెలంగాణలో బిజెపి క్యాదర చాలా ఉత్సహంగా పని చేస్తుందన్నారు. ఈ జోష్ రాబోయే ఎన్నికల వరకు మరింతగా కొనసాగుతుందని అన్నారు. హుజూరాబాద్ ఎన్నికల సమయంలో తీసుకొచ్చిన దళిత బందు అమలుకు నోచుకోవడం లేదని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రంతో పాటు పలు రాష్ట్రలలోని యువకులు ప్రపంచ వ్యాపంగా 55000 మంది లబ్ది పొందారనితెలిపారు. మోదీ పాలన వల్ల 75 వేల స్టార్టు ఆఫ్‌లు వచ్చాయని, మనం ఉద్యోగాలు అడిగే స్థాయి నుంచి ఉద్యోగాలు ఇచ్చె స్థాయికి ఎదిగామన్నారు. 40 వేల కోట్ల రూపాయాల కిసాన్ సమ్మాన్ వల్ల తెలంగాణాకు 200 కోట్లలో మహబూబ్‌నగర్ జిల్లాకు నిధులు వచ్చాయన్నారు. పీఎం ఆవాస్ వల్ల 2లక్షల డబూల్ బెడ్రూం ఇల్లు వచ్చారని తెలిపారు. కేంద్రం ఇచ్చిన నిధులకు యూసి ఇవ్వకుండా మాకు కేంద్రం నిధులు ఇవ్వడం లేదని కెటిఆర్ అనడం విడ్డురంగా ఉందన్నారు. అనాధికారిక ముఖ్యమంత్రిగా కెటీఆర్ వ్యవహరిస్తున్నారని, అందుకు కెసిఆర్ సిగ్గు పడాలని అన్నారు. తెలంగాణలో మెడికల్ కాలేజీ ఏర్పాటుకు ఒక్క ధరఖాస్తు పెట్టలేదన్నారు. యూపిలో డబూల్ ఇంజన్ సర్కార్‌తో 75 మెడికల్ కాలేజీలు ఏర్పాటు కాగా మరో 65 కాలేజీలు పూర్తవుతున్నాయని వివరించారు. తెలంగాణలో మార్పు వస్తుందని, త్వరలో రాష్ట్రనికి కొత్త మెడికల్ కాలేజీలు వస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో బిజెపి జాతీయ ఉపాధ్యక్షు రాలు డికె. అరుణ, మాజీ ఎంపి జీతేందర్‌రెడ్డి, రాష్ట్ర కొశాధికారి శాంతకుమార్, జిల్లా పార్టీ అధ్యక్షులు వీరాబ్రహ్మచారి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పద్మజారెడ్డి, మాజీ మంత్రి పి.చంద్రశేఖర్, నాగూరావు నామాజీ, ఎగ్గని నర్సిములు, శ్రీవర్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# మాట నిలబెట్టుకోని కెసిఆర్‌ను సాగనంపుదాం..

- పాలమూరు నీళ్లకై మరో నీళ్ల పోరాటం
- దక్షిణ తెలంగాణ పట్ల కెసిఆర్ వివక్షత
- కాళేశ్వరం మీద ఉన్న ప్రేమ పాలమూరుపై లేదు
- ప్రాజెక్టుల పేరుతో కమిషన్లు దండుకుంటున్న ప్రభుత్వం
- మహనేత వైఎస్ఆర్ బిడ్డను ఆశీర్వదించండి
- తెలంగాణలో సుపరిపాలన వైఎస్ఆర్‌సిపితోనే సాధ్యం
- ఉప్పునుంతలలో కొనసాగుతున్న ప్రజాప్రస్థాన పాదయాత్ర



మాట్లాడుతున్న వైఎస్ షర్మిల

**ఉప్పునుంతల, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త :** ఉద్యమ నాయకుడని కెసిఆర్‌కు ప్రజలు రెండుసార్లు అధికారం ఇస్తే అప్పుల కుప్ప చేశారని ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట నిలబెట్టుకోని కెసిఆర్‌ను సాగనంపుదామని, దక్షిణ తెలంగాణ పట్ల కెసిఆర్ వివక్షత చూపుతున్నారని వైఎస్ఆర్‌సిపి అధినేత్రి వైఎస్ షర్మిల ఆరోపించారు. వైఎస్ఆర్‌సిపి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నిర్వహిస్తున్న ప్రజాప్రస్థాన పాదయాత్ర 1900 కి.మీ దాటి శనివారం ఉదయం ఉప్పునుంతలకు చేరుకుంది. ఉప్పునుంతలలో దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని షర్మిల ఆవిష్కరించారు. ఈసందర్బంగా ఆమె మాట్లాడుతూ ఈ మాటల గారడి ప్రభుత్వానికి చరమగీతం పాడి మడమ తప్పని మహనేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలు తెలంగాణలో వైఎస్ఆర్‌సిపితోనే సుపరిపాలన సాధ్యమవుతుందని ఆమె అన్నారు. వైఎస్ఆర్ బిడ్డగా మీరు ఆశీర్వదించాలని, పులి కడుపులో పుట్టిన బిడ్డను పులిలాగా పని చేస్తానని ఆమె అన్నారు. మహనేత రాజశేఖర్‌రెడ్డి భౌతికంగా లేకపోయినా ప్రతి ఒక్కరి గుండెల్లో నిలిచిపోయారని మీ ఆదరణ, అభిమానంతో ప్రజల కోసం నిరంతరం పోరాటం కొనసాగిస్తానన్నారు. అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తూ దక్షిణ తెలంగాణ పట్ల కెసిఆర్ వివక్ష చూపుతున్నారని, పాలమూరు ప్రాజెక్టు పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిరసనగా పాలమూరు నీళ్లకోసం మరో నీళ్లపోరాటం కొనసాగిస్తున్నట్లు ఆమె ప్రకటించారు. ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు వైఎస్ఆర్‌సిపి అధ్యక్షురాలు చేపట్టిన ప్రజా ప్రస్థాన యాత్ర 141వ రోజుకు 1900 కి.మీ. దాటి అచ్చంపేట నియోజకవర్గంలోని ఉప్పునుంతల మండలంలో కొనసాగింది. ఎన్నో ప్రాజెక్టులు కట్టి పాలమూరును సస్యశ్యామలం చేసిన ఘనత వైఎస్ఆర్‌కే దక్కిందన్నారు. పక్కనే కృష్ణానది పారుతున్నా అచ్చంపేట నియోజకవర్గానికి కనీసం నీళ్ల లేవని కల్వకుర్తి ప్రాజెక్టు కింద 10 శాతం పనులు పూర్తి చేస్తే అచ్చంపేటకు నీళ్ల వస్తాయని ఎందుకింత నిర్లక్ష్యం అన్నారు. పాలమూరు జిల్లాకు పాలమూరు –రంగారెడ్డి ప్రాజెక్టు కీలకమని ఈ ప్రాజెక్టుకు మోక్షమెప్పుడని ప్రశ్నించారు.



షర్మిలకు బతుకమ్మలతో స్వాగతం పలుకుతున్న గిరిజన మహిళలు

**రాజన్నబిడ్డ రాకతో భారీగా ఘనస్వాగతం..**

స్వర్గీయ, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్ కూతురు వైఎస్ షర్మిల అచ్చంపేట మండలంలో ప్రజా ప్రస్థాన పాదయాత్ర ముగించుకుని ఉప్పునుంతల మండలంలో ప్రవేశించింది. దారి పొడవునా ప్రజలకు అభివాదం చేస్తూ పాదయాత్ర కొనసాగుతుండగా కట్లబండ వద్ద గిరిజన మహిళలు బతుకమ్మలతో ఆమెకు ఘన స్వాగతం పలికారు. కస్తూర్బా గాంధి విద్యాలయం, ఉప్పునుంతల హైస్కూల్ వద్ద ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు.

**మండుటెండలో కొనసాగిన ప్రసంగం..**

**అస్వస్థతకు గురైన షర్మిల**

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించిన వైఎస్ఆర్‌సిపి అధినేత్రి వైఎస్ షర్మిల మండుటెండలో ప్రసంగించారు. ప్రసంగిస్తున్న సమయంలో ఆమె కొంత అస్వస్థతకు గురైంది. అనంతరం ప్రజాప్రస్థాన పాదయాత్ర కొనసాగింది. ఉప్పునుంతల, గట్టుకాడిపల్లి, కంసాన్‌పల్లి, తిర్మలాపూర్ వరకు కొనసాగింది.

**కంసాన్‌పల్లిలో ఎమ్మెల్యేపై ఆగ్రహం...**

తెలంగాణ రాష్ట్రంలో నిర్వహిస్తున్న వైఎస్ఆర్‌సిపి ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజాప్రస్థాన పాదయాత్రలో భాగంగా నిర్వహిస్తున్న సమావేశాల్లో అచ్చంపేట ఎమ్మెల్యే దాడి చేయించాలని చూడడం సిగ్గుచేటని, ఇసుక మాఫియాతో ఆగడాలు రెచ్చిపోతున్నాయని వైఎస్ఆర్ సిపి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కంసాన్‌పల్లిలో సాయంత్రం నిర్వహించిన మాట, ముచ్చట కార్యక్రమంలో అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికి హక్కులున్నాయని గుండాగిరి చేయడం సరిపోదని ఆమె హెచ్చరించారు.

**వైఎస్ఆర్ అభిమాని ఇంటిముందు ఘనంగా నివాళులు..**

మండల కేంద్రమైన ఉప్పునుంతల గ్రామానికి చెందిన అంతటి వెంకటయ్యగౌడ్ ఇంటిముందు దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిత్రపటాన్ని ఏర్పాటు చేయడంతో వైఎస్ షర్మిల అభిమాని కోరిక మేరకు చిత్రపటం వద్ద కొబ్బరికాయ కొట్టి నివాళుల ర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి పిట్టల రాంరెడ్డి, పరిశీలకులు శ్రీనివాస్‌రెడ్డి, నియోజకవర్గ ఇంచార్జి దండు సిరి రమేష్, జిల్లా అధ్యక్షులు నర్సింహగౌడ్, ప్రదీప్‌కుమార్, మండల నాయకులు కొరిటకల్ రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల విద్యాలయాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలి..

జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా



కలెక్టర్ ను సన్మానిస్తున్న దృశ్యం

**వనపర్తి ప్రతినిధి, సెప్టెంబర్ 03 ప్రభాతవార్త:** గురుకుల, ట్రైబుల్ వెల్ఫేర్ పాఠశాలలను జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా సందర్శించారు. ఈ సందర్బంగా పాఠశాలల్లో చేపట్టే స్వచ్ఛ గురుకుల పోస్టరును గురుకుల సిబ్బందితో కలిసి ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 5వ తేదీ నుండి 11వ తేదీ వరకు జిల్లాలో ఉన్న ఆరు ఎస్సీ గురుకుల పాఠశాలల్లో చేపట్టే ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేయాలని ఆమె అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సెప్టెంబర్ 5వ తేదీ చెత్త తొలగింపు, 6వ తేదీన పాఠశాల భవనాలు, పడక గదులను శుభ్రం చేయడం, 7వ తేదీన టాయిలెటన్స్, నీటి ట్యాంకులు శుభ్రం చేయడం, పారిశుద్య ప్రాముఖ్యతపై విద్యార్థులకు పోటీలు నిర్వహించడం, 8వ తేదీన పాఠశాల వంటగది, డైనింగ్ హాల్ పరిసరాలను పరిశుభ్రం చేయడం, 9వ తేదీన గురుకుల పాఠశాల పరిసరాలలో మొక్కలతో సుందరీకరించడం, 10వ తేదీన సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, 11వ తేదీన వారోత్స వాల ముగింపు కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఆమె వివరించారు. స్వచ్ఛ గురుకుల కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని అన్ని గురుకుల విద్యాలయాల్లో పూర్తి స్థాయి స్వచ్ఛత, ఆకర్షణీయంగా ఉండేలా తీర్చిదిద్దాలని అధికారులకు ఆమె సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉన్నట్లయితే విద్యార్థులు వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉండగలరని ఆమె అన్నారు. ప్రతి ఒక్కరు కార్యక్రమంలో భాగస్వాములె కావాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ ఆర్‌సీఓ నాగరాజు, డిటిడిఓ శ్రీనివాస్, మద్రికుంట గురుకుల పాఠశాల ప్రిన్సి పల్ గోవర్ధన్, తిరుపతయ్య, ఎస్సీ గురుకుల ఆర్‌సీఓ అధికారులు, ఎస్సీ గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



స్వచ్ఛ గురుకుల పోస్టర్ ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

# ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలి



మాట్లాడుతున్న జిల్లా సీనియర్ సివిల్ జడ్జి జి. సబిత





ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు

**నాగర్‌కర్నూల్, సెప్టెంబర్3 ప్రభాతవార్త:** అన్ని రకాల వాహనదారులు ట్రాఫిక్ రూల్స్‌ను తప్పనిసరిగా పాటించాలని, అజాగ్రత్తతో వాహనాలను నడిపి ప్రాణాలను కోల్పోయి తమపై ఆధారపడ్డ కుటుంబాలను అనాధలుగా మార్చకండి అని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి జి. సవిత జిల్లా పౌరులకు పిలుపునిచ్చారు. పౌరులకు ట్రాఫిక్ నియంత్రణ చట్టాలపై అవగాహన కల్పించాలని సర్వోన్నత న్యాయస్థానాల ఆదేశాల మేరకు శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కోర్టునుండి గాంధిపార్కు వరకు ర్యాలీని నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ కూడలిలో ఏర్పాటు చేసిన సమావేశం ఆమె మాట్లాడుతూ వాహనాలను ట్రాఫిక్ చట్టాలకు లోబడి మాత్రమే వాహనాలను నడపించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, సీటుబెల్టు ధరించి వాహనం నడపాలన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ మద్యం తాగి డ్రైవింగ్ చేయరాదని, ద్విచక్రవాహనంపై ముగ్గురు ప్రయాణించరాదని, రాంగ్ రూట్‌లో వాహనాలు నడపవద్దని సూచించారు. ట్రాఫిక్ జంక్షన్‌ల వద్ద సిగ్నల్స్ జంప్ చేయవద్దని, మితిమీరిన వేగంతో వాహనాలు నడపరాదని సూచించారు. మైనర్లకు వాహనాలను ఇచ్చి ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులపై చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. తప్పనిసరిగా వాహనాల రిజిస్ట్రేషన్ పత్రాలతో పాటు ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్, ఫిట్నెస్ పత్రాలు వాహనాల్లో అందుబాటులో ఉండాలన్నారు. ప్రమాదాలు జరిగాక బాధపడకుండా, ప్రతిఒక్కరు వాహనాలను ట్రాఫిక్‌రూల్స్ ప్రకారం నడిపి తమప్రాణాలతోపాటు ఎదుటివారిప్రాణాలను కాపాడాలన్నారు. 2019 వాహన చట్టాలు చాలా కఠినంగా ఉన్నాయని, ప్రతి ఒక్కరు తప్పనిసరిగా చట్టాలకు లోబడి వాహనాలు నడపాలని చట్టాలను అతిక్రమించిన వారికి భారీ పెనాల్టీలు విధిస్తున్నామన్నారు. ప్రమాదాలకు గురై వారు చట్టపరంగా నష్ట నివారణ కింద న్యాయం పొందవచ్చన్నారు. జిల్లా ప్రిన్సి పల్ జూనియర్ సివిల్ జడ్జి స్వరూప మాట్లాడుతూ 2021లో కంటే 2022 సంవత్సరంలో వాహన ప్రమాదాల కేసులు కోర్టులో అధికంగా నమోదయ్యాయని ఆమె తెలిపారు. ట్రాఫిక్ చట్టాలను అతిక్రమించి అజాగ్రత్త అతివేగంతోనే అధిక ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారిపట్ల పోలీస్‌శాఖ కఠినంగా వ్యవహరించాలన్నారు. అదేవిధంగా ప్రభుత్వాలు కూడా రహదారులను ప్రమాద రహితంగా ఉండేలా కృషి చేయాలన్నారు. పట్టణాల్లో తప్పనిసరిగా వాణిజ్య సముదాయాల ముందు పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయాలని, వాహనాలను క్రమ పద్ధతిన పార్కింగ్ చేసేలా పోలీసు వారు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలను పాటించి తమ ప్రాణాలతో పాటు ఎదుటివారి ప్రాణాలను కాపాడుతూ కుటుంబాలతో సంతోషంగా గడిపేలా వాహనదారుల చర్యలు ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాస్‌గుప్త, ఆర్డీఓ ఎర్రిస్వామి, జనరల్ సెక్రెటరీ పర్వత్‌రెడ్డి, సిఐ హనుమంతు, ఎస్సై విజయ్‌కుమార్, జిల్లా కోర్టు సిబ్బంది, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, బార్ అసోసియేషన్ సభ్యులు, పోలీస్ ఆర్టీఏ శాఖల సిబ్బంది, అంగన్‌వాడి కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గరుడ యాప్ వినియోగం పక్కగా అమలు చేయాలి..

**ఆధార్ సీడింగ్, నూతన ఓటర్లను నమోదు చేయాలి..**

**జిల్లా అదనపు కలెక్టర్ ఆశీశ్ సంగ్వాన్..**



**వనపర్తి ప్రతినిధి, సెప్టెంబర్ 03 ప్రభాతవార్త:** శనివారం డిటిసీ సమావేశ మందిరంలో వనపర్తి, పెబ్బేరు మున్సిపల్ కమిషనర్ లతో బిఎల్ఓ లతో ఆధార్ సీడింగ్, నూతన ఓటర్ల నమోదు, ఫామ్ 6-బి, ఫామ్7-, ఫామ్ 8 పై ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫారం6-బి ద్వారా ఓటర్ నమోదైన వారికి ఆధార్ సీడింగ్, నూతన ఓటర్ల నమోదు ప్రక్రియను పక్కాగా అమలు చేపట్టాలని అధికారులకు సూచించారు. మున్సిపల్ సిబ్బంది, మెప్మా, గ్రామ స్థాయి అధికారులు, మహిళ సంఘాల సభ్యులు, ఆశాకార్యకర్తలు, అంగన్వాడీ టీచర్లు, సూపర్‌వైజర్లు ఇంటింటికి తిరిగి 18 సంవత్సరాలు నిండిన వారిని గుర్తించి, ఓటర్లుగా నమోదు చేయాలని, బూత్ స్థాయి అధికారులు(50) ఇండ్లు సర్వే చేసి 100% పూర్తి చేయాలని, ఈ ప్రక్రియలో ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని ఆయన తెలిపారు. ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం ఓటరు జాబితాలో ఇప్పటికే నమోదై ఉన్న ఓటర్లు తమ పేరు నమోదును ధృవీకరించుకొనుటకు ఆధార్ నెంబర్ ను ఫారం6-బి ద్వారా తెలియజేయ వలసి ఉంటుందని ప్రతి పౌరునికి ఒకే ఒక ఓటు హక్కు మాత్రమే ఉంటుందని, ఆధార్ నెంబర్ ను అనుసంధానం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ ప్రక్రియ అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజల సమన్వయంతో ఈనెల చివరి నాటికి స్వచ్ఛందంగా పూర్తి చేయాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ డి.వేణుగోపాల్, డీడబ్ల్యూఓ పుష్పలత, ఎంఆర్ఓ రాజేందర్ గౌడ్, వనపర్తి మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహా రెడ్డి, పెబ్బేరు మున్సిపల్ కమిషనర్ జాన్‌కృపాకర్, మెప్మా అధికారులు, బిఎల్ఓ లు, సిబ్బంది, రిసోర్స్ పర్సన్స్, అంగన్వాడీ టీచర్స్, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తిగత మరుగుదొడ్లు వినియోగించుకోవాలి:డిపిఓ



**పాన్‌గల్, సెప్టెంబర్03ప్రభాతవార్త:** మండలంలోని గ్రామాలలో ప్రజలు స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా నిర్మించుకున్న వ్యక్తిగత మరుగుదొడ్లను వినియోగించుకోవాలని జిల్లా పంచాయితీ అధికారి సురేష్ కోరారు. శనివారం ఆయన మండల పరిధిలోని కొత్తపేట, జమ్మాపూర్, తెల్లరాళ్లపల్లి గ్రామాలలో ప్రత్యేక అధికారుల బృందంతో వ్యక్తిగత మరుగుదొడ్ల పై జరుగుతున్న విచారణ కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా డిపిఓ సురేష్ గ్రామస్థులతో మాట్లాడారు. ప్రభుత్వం మంచి ఉద్దేశంతో గ్రామాలలో 100% వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మించుకునేందుకు నిధులు కేటాయించిందని, నిర్మించుకున్న మరుగుదొడ్లను సద్వినియోగం చేసుకోవాలని బాధ్యత ఇంటి యజమానులపై ఉంటుందని ఆయన సూచించారు. అనంతరం డిపిఓ గ్రామ పంచాయితీలను సందర్శించి పంచాయితీలోని రికార్డులను పరిశీలిం చారు. ప్రత్యేక అధికారుల బృందం సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.

## 41వ రోజుకు చేరుకున్న వీఆర్ఏ ల సమ్మె..



**పాన్‌గల్, సెప్టెంబర్03 ప్రభాతవార్త:** గ్రామాల్లో పని చేస్తున్న వీఆర్ఏ ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపడుతున్న వీఆర్ఏ ల నిరవధిక సమ్మె పాన్‌గల్ మండల కేంద్రంలో 42వ రోజుకు చేరుకుంది. శనివారం వీఆర్ఏ లు వినూత్న పద్దతిలో విఘ్నేశ్వరుడికి వి వినతి పత్రం అందజేసి నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి జ్ఞానోదయం కలిగేల చూడాలని మహాగణపతిని కోరుకున్నట్లు వీఆర్ఏ ల సంఘం అధ్యక్షుడు సురేష్ తెలిపారు. అనంతరం తహసిల్దార్ కార్యాలయం ముందు కొనసాగుతున్న సమ్మె దీక్షలో వీఆర్ఏల జేఏసీ జిల్లా ఛైర్మెన్ రమేష్, తెలంగాణ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్యా నాయక్ మద్దతు తెలిపి మాట్లాడారు, వీఆర్ఏ ల మధ్య చిచ్చు పెట్టే విధంగా ప్రభుత్వం చేస్తుందని వారు ఆరోపించారు. వీఆర్ఏ ల న్యాయమైన డిమాండ్ లను వెంటనే పరిష్కరించాలని వారు ప్రభుత్వానికి సూచించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని గ్రామాల వీఆర్ఏ లు పాల్గొన్నారు.

## పియులో బోధనేతర సిబ్బందికి ఒకరోజు వర్క్‌షాపు

**-ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ప్రోస్పెక్టస్ అంశంపై వర్క్‌షాపు**

**మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్, సెప్టెంబర్ 03 ప్రభాతవార్త :** పాలమూరు యూనివర్సిటీ ఇంటర్నల్ క్వాలిటీ అసోసియేషన్ సెల్ (ఐక్యూఏసి) సెక్యూరిటీ అండ్ ఎక్ఛేంజ్ బోర్డు ఆఫ్ ఇండియా (ఎంఇబిఐ) ఇందులో ఇన్వెస్ట్మెంట్ అండ్ ప్రోస్పెక్టివ్ అంశంపై బోధన, బోధనేత సిబ్బందికి ఒకరోజు వర్క్‌షాపు నిర్వహించారు. కార్యక్రమంలో సెబి రిసోర్స్ పర్సన్, పాలమూరు విశ్వవిద్యాలయ పిజి సెంటర్ కొల్లాపూర్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న డా. ఎంఎస్ఆర్ ఆంజనేయులు వర్క్‌షాపును నిర్వహించారు. ఇందులో



భాగంగా వివిధ ఆర్థిక అంశాలైన కుటుంబ ఆర్థిక విషయాలు, పొదుపు, పెట్టుబడికి సంబంధించిన పథకాల భద్రతకు సంబంధించిన రుణ సంబంధ పథకాలు, మహిళలకు సంబంధించిన పథకాలు, పిల్లల అభివృద్ధికి తగిన బంగారంలో పొదుపు చేసేందుకు మార్గదర్శకాలు మందలైన అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాలమూరు విశ్వవిద్యాలయం ఐక్యూఏసి డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆర్థికపరమైన అంశాలపై అవగాహన కలిగి ఉండడం ద్వారా భవిష్యత్తులో ఎటువంటి ఆర్థిక ఇబ్బందులకు గురవకుండా ఉండడానికి వీలు కలుగుతుందని అన్నారు. యూనివర్సిటీ బిసి కాలేజ్ ప్రిన్సిపల్ డా. ఎన్. కిశోర్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ముఖ్యంగా మధ్య తరగతి ఆదాయ వర్గాల వారికి ఆర్థిక స్వావలంబనకు ఎంతగానో దోహపడుతుందని అన్నారు. కార్యక్రమంలో పాలమూరు విశ్వవిద్యాలయం కంట్రోలర్ ఎడ్యుకేషన్ డా. రాజకుమార్, ఫార్మసి కళాశాల ప్రిన్సిపల్ పాలమూరు శ్రీ విద్యా కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ డా. బషీర్ అహ్మద్, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ డా. ఎస్ఎన్ అర్జున్‌కుమార్, వివిధ శాఖాధిపతులు, బోధనా, బోధనేతర సిబ్బంది పాల్గొని కార్యక్రమం విజయవంతం చేశారు. డైరెక్టర్, రిసోర్స్ పర్సన్‌ను వైస్ ఛాన్సలర్ ప్రొ॥ లక్ష్మీకాంత్ రాథోడ్, రిజిస్టర్ ప్రొ॥ గిరిజ మంగతాయారును అభినందించారు.

## ఒంటికాలిపై నిలబడి విఆర్ఎల నిరవధిక దీక్షలు



**తెల్కపల్లి, సెప్టెంబర్ 03 ప్రభాతవార్త :** విఆర్ఎల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విఆర్ఎల రాష్ట్ర జాక్ పిలుపు మేరకు శనివారం మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం ముందు విఆర్ఎలు ఒంటికాలిపై నిలబడి దండం పెడుతూ నిరవధిక సమ్మె దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా విఆర్ఎల సంఘం మండల జాకో ఛైర్మన్ కె. అశోక్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమ ం త్రి కెసిఆర్ విఆర్ఎలకు అసెంబ్లీలో ప్రకటించిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. విఆర్ఎలకు పేస్కేల్ ఉత్తర్వులు ఇవ్వాలని, అర్హులై న విఆర్ఎలకు ప్రమోషన్లు ఇవ్వాలని 55 సంవత్సరాలుపై బడిన విఆర్ఎల వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల జాక్ ఛైర్మన్ కె. అశోక్‌తో పాటు, కో ఛైర్మన్ ఇబ్రహీం, జనరల్ సెక్రెటరీ టి.రాము, సోషల్ మీడియా కన్వీనర్ సాయి, కో కన్వీనర్లు కె. బాలమ్మ, సైదులు, సుల్తాన్, వివిధ గ్రామాల విఆర్ఎలు పాల్గొన్నారు.

## కొవిడ్ వ్యాక్సిన్ ప్రచార ఫ్లెక్సీలో మోడీ బొమ్మా ఉండాలి

**– అధికారులను ఆదేశించి కేంద్ర మంత్రి మహేంద్రనాథ్ పాండే**

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్, 3, ప్రభాతవార్త:** పంచాన్ని గడగడలాడించిన కరోనా మహమ్మారిని నివారించేందుకు కేంద్రం అమలు చేస్తున్న కొవిడ్ వ్యాక్సీనేషన్ కార్యక్రమ ప్రచార ఫ్లెక్సీలపై దేవ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ బొమ్మను తప్పని సరిగా పెట్లాని కేంద్ర భారీ పరిశ్రమలశాఖ మంత్రి మహేంద్రనాథ్ పాండే వైద్యారోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా అయన శనివారం జిల్లా కేంద్రంలోని పాతపాలమూరులోని ప్రాథమిక అరోగ్య కేంద్రాని పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన వాక్సీనేషన్ ఫ్లెక్సీపై రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్, అరోగ్యమంత్రి హరీష్‌రావుల ఫోటోలు పెట్టిన తీరును కేంద్రమంత్రి తప్పు పట్టారు. వ్యాక్సీనేషన్ అమలు చేసే దేశ ధ్రామంత్రి ఫోటోను ఎందుకు పెట్టలేదని అధికారులను ప్రశ్నించారు. వ్యాక్సీనేషన్ పారదర్శంగా సాగాలని ప్రజలకు అరోగ్య సమస్యలు లేకుండా వైద్యసేవలందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జాతీయుపాధ్యాక్షురాలు డికె అరుణ, జిల్లా పార్టీ అధ్యక్షులు వీరాబ్రహ్మాచారి, డిఎంహెచ్ఓ కృష్ణ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# కేరళ రాష్ట్ర గ్రామ పంచాయితీలు ప్రజలకు ఆదర్శం:జడ్పీ ఛైర్మెన్

**వీపనగండ్ల, సెప్టెంబర్ 03 ప్రభాతవార్త:** కేరళ రాష్ట్రంలోని గ్రామ పంచాయితీలు ప్రజలకు ఆదర్శంతంగా సేవలు అందిస్తున్నాయని దానికి వాటి గొప్పతనం ఆ గ్రామాలలో పని చేసే సర్పంచులది అని ఆయన తెలిపారు. శనివారం వీపనగండ్ల మండల సర్వసభ్య సమా వేశం ఎంపిపీ కమలేశ్వర రావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశా నికి ముఖ్య అతిథిగా వనపర్తి జిల్లా పరిషత్ ఛైర్మెన్ లోక్‌నాథ్ రెడ్డి, కొల్లాపూర్ మార్కెట్ కమిటీ ఛైర్మెన్ కిషన్ నాయక్ హాజరయ్యారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొని ప్రజప్రతి నిధులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. ముందుగా వ్యవసాయశాఖ అధికారి డాక్వేశ్వర్ గౌడ్ మాట్లాడుతూ ఆరోగ్యం, ఇరిగేషన్ మిషన్ భగీరథ తదితర అంశాలపై సమావేశం విస్తృతంగా చర్చ జరిగింది. ఇందులో బొల్లారం సర్పంచ్ పద్మ మాట్లాడుతూ త్రాగునీటికి ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని మిషన్ భగీర థ ద్వారా నీళ్ల అందడంలేదని ఆమె సభ దృష్టికి తీసుకువచ్చింది దానితో మిషన్ భగీరథ అధికారి ఉదయ్ మాట్లాడుతూ రెండు రోజు ల్లో ఆ సమస్యను పరిష్కారం చేస్తామని చెప్పినప్పటికి సర్పంచ్ పద్మ వినలేదు రెండు మూడు సమావేశాలలో ఇప్పటికే సభ దృష్టికి తీసుకువచ్చిన ఫోన్ ద్వారా ఈ సమస్యను అధికారులకు చెప్పిన పట్టించుకోవడంలేదని ఆమె అధికారితో తీవ్రంగా విరుచుకుపడింది ఈ విషయం సభ దృష్టికి సర్పంచ్ తీసుకు వచ్చిన సందర్భంగా ఆ గ్రామ పంచాయితీ కార్యదర్శి ఫోన్ లో వేరే అంశాలను చాటింగ్ చే సుకుంటూ సభలో మాట్లాడుతున్న విషయాలని వినకుండా ఉన్నా రు. కొల్లాపూర్ మార్కెట్ కమిటీ ఛైర్మెన్ కిషన్ నాయక్ మాట్లా డుతూ కొల్లాపూర్ మార్కెట్ కమిటీ నుండి సహాయ సహకారాలు ఉంటాయని ఆయన ప్రజా ప్రతినిధులకు



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా పరిషత్ ఛైర్మెన్ లోక్‌నాథ్ రెడ్డి

తెలియజేశారు అనంతరం వనపర్తి జిల్లా పరిషత్ ఛైర్మెన్ మాట్లాడుతూ కేరళ రాష్ట్రంలోని గ్రా మపంచాయితీల పదివేల నుండి 12వేల జనాభ కలిగి ఉంటాయని అక్కడి సర్పంచులకు ఆ రాష్ట్రం రూ.40వేలు నెలకు జీతం ఇవ్వడం జరుగుతుందని వారు నిత్యం గ్రామంలో ఉండే వివిధ సమస్యలను పరిష్కరిస్తూ ఎప్పటికప్పుడు ప్రజల బాగోగులు తెలుసుకోవడం జరు గుతుందని వార్డు మెంబర్లతో సహా అధికారులు ప్రజాప్రతినిధులు కలిసి సమస్యలపై ఉమ్మడిగా చర్చించుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తారని అందుకే ఆ రాష్ట్రంలోని గ్రామ పంచాయితీలు అభివృ ద్ధి వైపు నడుస్తున్నాయని మూడంచెల విధానం కొనసాగుతుందని ఆయన ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులకు తెలిపారు. మన రాష్ట్రం నుండి గ్రామ పంచాయితీలు వివిధ రాష్ట్రాలలో వాటికి ఉన్న వన ారులు ఏమిటి అభివృద్ధి ఎలా జరుగుతుందనే అంశంపై



అధికారులను నిలదీస్తున్న బొల్లారం మహిళా సర్పంచ్ పద్మ

29మంది సర్పంచులు 29 రాష్ట్రాలకు అధ్యయనం కోసం వెళ్లినప్పుడు 29లో ఒకరు కేరళ వెళ్లడం జరిగిందని ఆ వెళ్లిన సర్పంచ్ చెప్పిన అధ్యయనం పరంగా అక్కడి గ్రామ పంచాయితీలో జరుగుతున్న అభివృద్ధిపై మాకు తెలియజేశారని అన్నారు. దీనితో పాటు వీపనగండ్ల మండల కేంద్రంలో ఎస్సీ గురుకుల పాఠశాల మార్కెట్ యార్డ్ లో పునరుద్దరణ కోసం నిధులు కేటాయించడం జరుగుతుందని దానికి తన సహకారం ఉంటుందని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ఈ సమావేశానికి రైతుబంధు మండల అధ్యక్షుడు ఎత్తం కృష్ణయ్య, తూముకుంట సింగిల్‌విండో ప్రెసిడెంట్ రామన్ గౌడ్, ఎంపీడీఓ కతలప్ప, ఎంఆర్ఓ పాండు నాయక్, సర్పంచులు వి.నరసింహారెడ్డి, రఘునాథ్ రెడ్డి, రవీందర్ రెడ్డి, విజయ్ కుమార్ తో పాటు ఎంపీటీసలు కవిత, పార్వతి, పొగాకు రాము తదితరులు హాజరు కావడం జరిగింది.

# కరెంట్ షాక్ తో కానిస్టేబుల్ మృతి..

**విధుల్లో అంకిత భావం, క్రమశిక్షణ కలిగిన శ్రీను మరణం జీర్ణించుకోలేనిది..**

**అంతిమ యాత్రలో పాల్గొన్న జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది..**



మృతుడు శ్రీనివాసులు(ఫైల్)



వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రి దగ్గర శ్రీను మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ఎస్పీ అపూర్వరావు

**వనపర్తి ప్రతినిధి, సెప్టెంబర్ 03 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా సాయుధదళ కార్యాలయంలో డాగ్ స్క్వాడ్ విభాగంలో కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న 2012 బ్యాచ్ కు చెందిన శ్రీనివాసులు శుక్రవారంతన స్వగ్రామమైన కానాయిపల్లి గ్రామంలో రాత్రి తన వ్యవసాయ పొలం పక్కన పొలం వారు అడవిపందుల కొరకు ఏర్పాటు చేసిన కరెంట్ కంచెలో ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వెంటనే జిల్లా ఎస్పీ కె.అపూర్వ రావు వనపర్తి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి మృతదేహానికి పూలమాలతో నివాళి అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు. అంత్యక్రియల నిమిత్తం రూ.20వేలు ఆర్థిక సహాయం అందజేశారు. శ్రీనివాసులు కు భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. అనంతరం మృతుని అంత్యక్రియలు అతని స్వగ్రామమైన కానాయిపల్లి గ్రామంలో జరుగుతాయని తెలుపగా పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించాలని సాయుధ దళాధిపతి రిజర్వ్ ఇన్స్పెక్టర్ జగన్ కు ఎస్పీ ఆదేశించారు. ఈ సందర్భంఆ ఎస్పీ మాట్లాడుతూ నేడు కానిస్టేబుల్ మరణం దురదృష్టకరమని, వనపర్తి జిల్లా సాయుధదళ కార్యాలయంలో డాగ్ స్క్వాడ్ విభాగంలో పని చేస్తూ ఎన్నో దొంగతనాల కేసులు చేధించారని విధులపట్ల అంకితభావంతో పని చేస్తూ క్రమశిక్షణ కలిగిన ఉద్యోగిగా మంచి పేరు పొందారని పేర్కొన్నారు. వారి కుటుంబానికి పోలీసు శాఖ అండగా ఉంటుందని తెలియజేశారు. పోలీసు అధికారులు, తోటి సిబ్బంది, మిత్రులు, అంతిమ యాత్రకు హాజరై అధిక సంఖ్యలో పాల్గొని శ్రీను అమర్ హై అంటూ నినాదాలు చేస్తూ అంత్యక్రియలను పూర్తి చేశారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆకస్మిక తనిఖీ..



**శ్రీరంగాపురం, సెప్టెంబర్ 03 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను వనపర్తి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి జాకీర్ హుస్సేన్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. శనివారం ఉదయం ప్రార్థన సమయానికి హాజరైన అనంతరం ఇంచార్జి ప్రిన్సిపల్, అధ్యాపకులు, అధ్యాపకులు, అధ్యాపకేతర బృందంతో సమావేశం నిర్వహించి అన్ని రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఐఈఓ జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ కళాశాల అడ్మిషన్లు పెంచాలని మరియు విద్యార్థులు హాజరు శాతం పెంచి ఈ విద్యా సంవత్సరం ఉత్తమ ఫలితాలను సాధించాలని కోరారు. ఈ సమావేశంలో భాగంగా ఇన్చార్జి ప్రిన్సిపల్ సైదునిసా బేగం, లెక్చరర్లు శ్రీదేవి, కురుమూర్తి, శ్రీధర్, కృష్ణమూర్తి, వెంకటకృష్ణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థి కుటుంబానికి చేయూత..



**పాన్‌గల్, సెప్టెంబర్ 03 ప్రభాతవార్త:** మండల కేంద్రానికి చెందిన హోంగార్డు విష్ణు గత పది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా అతనితో పాటు పాన్‌గల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1999 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు హోంగార్డు విష్ణు కుటుంబానికి బాసటగా నిలిచారు. విష్ణు కుటుంబాన్ని ఆదుకోవాలని ఉద్దేశంతో పూర్వ విద్యార్థులు కలిసి పోగు చేసిన రూ.45వేల నగదును శనివారం విష్ణు కుటుంబ సభ్యులకు అందజేశారు. చిన్నతనం నుంచి కలిసి చదువుకున్న విష్ణు అకాల మరణం చెందడం చాలా బాధాకరమని విష్ణు కుటుంబానికి అండగా ఉండాలనే ఉద్దేశంతో తమ వంతుగా సేకరించిన నగదును కుటుంబ సభ్యులకు అందజేశామని పూర్వ విద్యార్థులు తెలిపారు. అంతకు ముందు విష్ణు చిత్రపటానికి పూల వేసి ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## దవాజిపల్లి గ్రామంలో సమీపంలో ట్రాక్టర్ ప్రమాదం..

**పాన్‌గల్, సెప్టెంబర్ 03 ప్రభాతవార్త:** మండల పరిధిలోని దవాజిపల్లి స్టేజీ సమీపంలో శనివారం ట్రాక్టర్ ప్రమాదం చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తకోట పట్టణానికి చెందిన నవీన్ కుమార్ రెడ్డి అనే వ్యక్తి ఇటీవల ట్రాక్టర్ ను కొనుగోలు చేసి కొత్తకోట నుంచి మండలంలోని తెల్లరాళ్లపల్లి గ్రామానికి సిమెంట్ సీకు లోడుతో వస్తుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ ట్రాలీ టైరు ఊడిపోవడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాద సంఘటనలో మనుషులకు ఎలాంటి గాయాలు కాలేదని ట్రాక్టర్ ట్రాలీ స్వల్పంగా దెబ్బతిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

### సర్వే నెంబర్ 980 లోని ప్రభుత్వ భూమిని

# అన్యాయక్రాంతం కాకుండా కాపాడండి..

**అచల పక్ష ఐక్య వేదిక అధ్యక్షుడు సతీష్ యాదవ్**



ఆక్రమానికి గురైన ప్రభుత్వ స్థలాన్ని పరిశీలిస్తున్న అచల పక్ష నాయకులు

**వనపర్తి టౌన్, సెప్టెంబర్ 03 ప్రభాతవార్త:** పాన్‌గల్ రోడ్డు తిరుమల కాలనీలో గల ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 980 లోని 23 గుంటల భూమిని రక్షించాలని శనివారం భూమిని పరిశీఇంచారు. ఈ సందర్భంగా అచలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు సతీష్ యాదవ్ మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం రిజిస్ట్రేషన్ ఆఫీస్ కొరకు 980 లోని 23 గుంటల భూమిని పరిశీలించారు కానీ అక్కడ అనువాలేదని అర్ధ చంద్రాకారంలో ఉన్న భూమి రిజిస్ట్రేషన్ ఆఫీసు సరిపోదని తిరస్కరించారని ఆయన తెలిపారు. అయితే కాలనీ విస్తరించడంతో అక్కడ ఉన్న ప్రభుత్వ భూమిలో కొందరు మెల్లమెల్లగా జరుగుతూ ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్న సందర్భంగా కాలనీ వాసులు కోరిక మేరకు అచలపక్ష ఐక్యవేదిక ఆ భూమిని సందర్శించి అక్కడ కొద్దికొద్దిగా ఆక్రమణకు గురౌతున్న వైనం చూసి వెంటనే సంబంధిత అధికారులు సర్వే చేసి భూమి మొత్తాన్ని తమ ఆధీనంలోకి తీసుకోవాలనీ తిరుమల కాలనీలో పార్కు లేనందున దాన్ని చిల్డ్రన్ పార్కుగా ఏర్పాటు చేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా లను కోరడం జరిగిందని ఆయన తెలిపారు. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ భూములు తక్కువగా ఉన్నందున ఉన్న భూములను వెంటనే రక్షించి అక్కడ అవసరాలకు తగ్గట్టుగా పార్కులు మిగతా మున్సిపల్ చట్టం ప్రకారం ఏర్పాటు చేయాలని అచలపక్ష ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేస్తున్నారు. కానీ కాలనీ వాసులు మాత్రం మాకు ఇక్కడ డెవలప్మెంట్ కావాలంటే ఏదో ఒక ఆఫీస్ కావాలని అడగడంతో అచల పక్షం నాయకులు ఈ స్థలం దానికి సరిపోదని, పార్కు ఐతేనే బాగుంటుందని కాలనీకి కూడా డెవలప్ ఐతుందని పిల్లలకు పార్క్ కావాలని నచ్చజెప్పడం జరిగింది. కాలనీ వాసుల కోరిక మేరకు 14వ, 15వ ఫైనాన్సులలో పార్కులకు కేటాచించిన డబ్బులను ఈ పార్క్ కూడా కేటాయించాలని అచలపక్ష ఐక్యవేదిక డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అచలపక్ష ఐక్య వేదిక ఉపాధ్యక్షుడు వెంకటేష్, సభ్యులు అడ్వకేట్ ఆంజనేయులు, నందిమల్ల చంద్రమౌళి, వైఎస్ఆర్ సతీష్, తిరుపతయ్య, భాస్కర్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు

## శ్రీరంగాపురం రంగసముద్రానికి మంత్రి నిరంజన్ రెడ్డి బోటు ఏర్పాటు..



క్రేను సహాయంతో రంగసముద్రంలో బోటు వదులుతున్న అధికారులు

**శ్రీరంగాపురం, సెప్టెంబర్ 03 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో శ్రీరంగానాథ స్వామి ఆలయంలో ఉంది ఇది తెలంగాణలోని పురాతన దేవాలయాల్లో ఒకటి. 1650-70 మధ్య కాలంలో రాజు రామేశ్వర్ రావు వంశీయులు వనపర్తి సంస్థానం శ్రీరంగాపురం లోని రత్న పుష్కరిని సరస్సు కట్టపై ఈ ఆలయాన్ని నిర్మించారు. ఇది తమిళనాడులోని శ్రీరంగ దేవాలయాన్ని పోలి ఉంది. ఒక సారి దక్షిణ దేశ యాత్రలకు వెళ్లి రాజా బహిరి గోపాలరావు, శ్రీరంగ పట్టణాన్ని దర్శించి వైష్ణవ మతాన్ని స్వీకరించాడు. తీర్థయాత్రల నుండి తిరిగివచ్చిన తరువాత ఒక రోజు రాత్రి రాజు కలలో శ్రీరంగనాథస్వామి కనిపించి, తాను కానాయిపల్లి గ్రామంలో వల్మీకములో ఉన్నానని, తీసుకొని వచ్చి ప్రతిష్ఠించి, ఆలయాన్ని నిర్మించి పూజలు చేయాలని చెప్పాడు. కలలో చెప్పిన దానాని బట్టి వల్మీకములో శయనమూర్తియైన శ్రీరంగనాథస్వామి విగ్రహం లభించింది. ఆ విగ్రహాన్ని కొరివిపాడు గ్రామానికి తీసుకొచ్చి ఆలయం నిర్మించి ప్రతిష్టాంచాడు. అప్పటి నుండి నుండి కొరివిపాడు గ్రామం శ్రీరంగాపురంగా పేరొందింది. చుట్టూ రాజా రామేశ్వరావు శ్రీరంగ సముద్రం అనే పెద్ద చెరువు ను త్రవ్వించాడు. తర్వాత లక్ష్మి తాయారు దేవాలయాన్ని కూడా నిర్మించాడు. చిత్రభాను సంవత్సరం మార్గశిర మాసంలో రాజారామేశ్వరరావు ధర్మపత్ని శంకరమ్మ ఐదంతస్థుల తూర్పు రాజగోపురాన్ని నిర్మించింది. ఈ రంగసముద్రవ చెరువు ఇప్పుడు మండల ప్రజలకు తాగునీరు. సాగునీరు అందిస్తుంది. ఈ ఆలయానికి నిరంతరం సందర్శకులు వస్తుంటారు కావున మండల కేంద్రంలోని రంగసముద్రం లో బోటింగ్ ఏర్పాటు చేయాలని గతంలో ఒక బోటును రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఇవ్వడం జరిగింది. శనివారం మరొక బోటును మంత్రి 17 రూ.లక్షల విలువగల 20 సీటర్ కెపాసిటీ సామర్థ్యం గల క్యాటెమరి బోట్ ను డీజేఎం ఇబ్రహీం, ఏజీఎం బాలకృష్ణ, తెలంగాణ టూరిజం వారి ఆధ్వర్యంలో శ్రీరంగాపురం రంగసముద్రం లో ఈ బోటును వదిలారు. గుడి ఆవరణలో ఉన్నది కావున పర్యాటకుకు, ప్రజలకు అందుబాటులో ఉండేట్లుగా శ్రీరంగనాథస్వామి ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి పరుస్తామని గతంలో మంత్రి తెలిపారు. దీనిలో భాగంగా మంత్రి బోటు ఇవ్వడం జరిగిందని తెరాస మండల సీనియర్ నాయకులు ఆర్ పృధ్వీరాజ్ తెలిపారు.

## మెట్టు శ్రీనివాస్‌ను కలిసిన నాయకులు



**జడ్చర్ల, సెప్టెంబర్ 03 ప్రభాతవార్త :** రోడ్ డివలప్‌మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ మెట్టు శ్రీనివాస్‌ను గిరిజన కో ఆపరేటివ్ కార్పోరేషన్ ఛైర్మన్ వాల్యానాయక్, మహబూబ్‌నగర్ జిల్లా పరిషత్ వైస్ ఛైర్మన్ కోడుగల్ యాదయ్య శనివారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. అనంతరం జిల్లా పరిషత్ వైస్ ఛైర్మన్ కోడుగల్ యాదయ్య గిరి బజార్‌లో గిరిజన ఉత్పత్తులను కొనుగోలు చేశారు. వారివెంట స్థానిక నాయకులు కొంగలి నాగరాజు ఉన్నారు.

## విద్యానగర్‌లో అన్నదానం



**జడ్చర్ల, సెప్టెంబర్ 03 ప్రభాతవార్త :** వినాయక నవరాత్రులను పురస్కరించుకుని జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని విద్యానగర్ కాలనీలో మహబల యూత్ ఆధ్వర్యంలో గణపతికి ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భజన కీర్తనలు, భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో 24వ వార్డు కౌన్సిలర్ ప్రశాంత్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ మహ్మద్ షేక్, గోనెల రాధాకృష్ణ, యూత్ కమిటి సభ్యులు సంతోష్, రమేష్, కార్తీక్, రాజేందర్, కృప, శివకుమార్, రఘు, శివారెడ్డి, దీపక్‌రెడ్డి, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

## 30 సంవత్సరాలు పైబడిన వారికి బీపీ, షుగర్ పరీక్షలు చేయాలి..



**గోపాల్‌పేట, సెప్టెంబర్ 03 ప్రభాతవార్త:** 30 సంవత్సరాలు పైబడిన వారికి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా ఇవ్వాలని డిప్యూటి మెడికల్ ఆఫీసర్ డా.శ్రీనివాసులు సూచించారు. ప్రభుత్వ వైద్యశాలలో నేషనల్ హెల్త్ ప్రోగ్రం సమీక్ష సమావేశానికి హాజరై డా.శ్రీనివాసులు మాట్లాడుతూ గ్రామాలలో 30 సంవత్సరాలు పైబడిన వారికి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి నిర్ధారణ అయిన వెంటనే మందులు అందజేసి కచ్చితంగా వాడాలని సూచించాలని వైద్య సిబ్బందికి తెలిపారు. అదే విధంగా వారి పేర్లను ఆన్‌లైన్ లో నమోదు చేయాలని అన్నారు. ఆయుష్మాన్ భారత్ ప్రోగ్రంలో ఎవరైన వ్యాధి గ్రస్తులుంటే వారి పేర్లు ఆన్‌లైన్ నమోదు చేస్తూ టెలిమెడిసన్ ద్వారా గ్రామాల్లో ఎవరైన దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతుంటే ఆ సంబందిత డాక్టర్ కు ఆన్‌లైన్ ద్వారా తెలియజేసి పేషెంట్ కు మందులు అందజేయాలని తెలిపారు. సబ్ సెంటర్ యందు ప్రజలకు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలని తెలిపారు. కోవిడ్ వ్యాధి పై బూస్టర్ డోస్ 100కి 100% అమలైయ్యేలా అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు అభిరామ్, క్లైవిన్ మార్క్, మమత, పుష్పలత, అంజలి, హర్షిత, సబ్రిన్ పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



**జడ్చర్ల, సెప్టెంబర్ 03 ప్రభాతవార్త :** జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని శ్రీనివాస కాలనీకి చెందిన యాదమ్మకు మంజూరైన రూ. 24 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును వార్డు కౌన్సిలర్ సామ రఘురాంగౌడ్ శనివారం అందజేశారు. సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరమని అన్నారు. కార్యక్రమంలో తెరాస నాయకులు ఇమ్మడి యాదయ్య, రమణయ్య, రాజుచారి, ఆంజనేయులు, మాల్యాద్రి, నారాయణస్వామి పాల్గొన్నారు.

## అధికారిపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్సీ



**వెల్దండ, సెప్టెంబర్ 03, ప్రభాతవార్త:** వెల్దండ మండల కేంద్రంలోని ఎవీఆర్ గార్డెన్‌లో ఆసరా ఫించన్ గుర్తింపు కార్డులకు తనకు ఎలా సమాచారమివ్వరని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి ఇన్‌చార్జి ఎంపీడీఓ మోహన్‌లాల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికార కార్యక్రమానికి ప్రభుత్వ ఎమ్మెల్సీగా ఉన్న నాకు మీరు ఎలా సమాచారమివ్వరని, అధికారులు సమాచారమివ్వకుండా తమాషాలు చేస్తున్నారా అని ప్రశ్నించారు. అధికారుల అలసత్వంతో మరింత మంది లబ్ధిదారులకు పింఛన్లు రాలేకపోయాయని, సీఎం కేసీఆర్ సబ్బండ వర్గాల సంక్షేమానికి కృషి చేస్తుంటే అధికారులు తప్పిదం చేయడం వల్లనే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందన్నారు. లబ్ధిదారులు ఫోన్ ద్వారా సమాచారమిస్తేనే కార్యక్రమానికి హాజరయ్యానని, మరోసారి ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ప్రజాప్రస్థాన పాదయాత్రను విజయవంతం చేయాలి...

**-నేటి నుంచి కల్వకుర్తి నియోజకవర్గంలో వైఎస్ షర్మిల పాదయాత్ర**



**కల్వకుర్తి, సెప్టెంబర్ 03, ప్రభాతవార్త:** మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తనయురాలు షర్మిల చేపడుతున్న పాదయాత్రను విజయవంతం చేయాలని పాలమూరు జిల్లా పరిశీలకులు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శనివారం కల్వకుర్తి పట్టణంలోని ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ తెలంగాణ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు వైఎస్.షర్మిల తెలంగాణ రాష్ట్ర ప్రజల పక్షాన నిలబడి ప్రజా సమస్యలు తెలుసుకొని సమస్యల పరిష్కారంలో చేవళ్ల నుంచి చేవళ్ల వరకు 400 రోజుల పాటు 4వేల కిలో మీటర్ల చేపట్టిన ప్రజాప్రస్థాన పాదయాత్రలో భాగంగా ఆదివారం కల్వకుర్తి మండలంలోని జంగారెడ్డిపల్లి గ్రామానికి విచ్చేస్తున్నారని, కల్వకుర్తి మండల అధ్యక్షులు పుట్టా శేఖర్ నాయకత్వంలో షర్మిలకు స్వాగత ఏర్పాట్లపై చర్చించారు. అనంతరం కల్వకుర్తి కోఆర్డినేటర్ చీమర్ల అర్జున్‌రెడ్డి మాట్లాడుతూ రాజన్న బిడ్డ పాదయాత్ర కోసం ఘన స్వాగతం పలుకడానికి నియోజకవర్గ ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో ఎందరో వీరుల ప్రాణ త్యాగాలతో కొట్లాడి తెచ్చుకున్న ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో అధికారం చేపట్టిన కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణను బంగారు తెలంగాణగా తీర్చిదిద్దుతారని ఎన్నో రకాల మోసపూరిత హామీలను ఇస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని, ఎనిమిదేండ్ల టీఆర్ఎస్ పాలనలో తెలంగాణ రాష్ట్రం అప్పుల మయంగా మారిందన్నారు. వైఎస్ షర్మిల చేపడుతున్న ప్రజాప్రస్థాన పాదయాత్రలో అధిక సంఖ్యలో నియోజకవర్గ ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షులు నరసింహాగౌడ్, తలకొండపల్లి మండల అధ్యక్షులు తిరుపతి, ఆమనగల్లు మండల అధ్యక్షులు రహీం, నాయకులు జహంగీర్, సంజీవ్,మధు, సూరి, సాయి, నితీష్ తదితరులు ఉన్నారు.

## మృతుని కుటుంబాన్ని పరామర్శించిన మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం



**కల్వకుర్తి, సెప్టెంబర్ 03, ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణ పరిధిలోని సంజాపూర్ గ్రామానికి చెందిన బుడగ జంగాల హుస్సేన్ కిడ్నీ వ్యాధితో బాధపడుతూ కడుపు నొప్పి భరించలేక ఉరివేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం బాధితుడిని పరామర్శించి వైద్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. వైద్య ఖర్చుల నిమిత్తం బాధితుడికి రూ.5వేల ఆర్థిక సహాయం అందించారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. జంగాల హుస్సేన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. హుస్సేన్ మృతి చెందడంతో ఆ కుటుంబానికి మున్సిపల్ చైర్మన్ సంతాపం వ్యక్తం చేశారు.మున్సిపల్ వెంట ఆంజనేయులు, పవన్, రాజు తదితరులు ఉన్నారు.

## కోవిడ్ గర్భిణికి ప్రసవం నిర్వహించిన వైద్యులు



**కల్వకుర్తి, సెప్టెంబర్ 03, ప్రభాతవార్త:** ఊర్కొండ మండలం రాచాలపల్లి తాండకు చెందిన ఇస్లావత్ జ్యోతి ప్రసవం కోసం ప్రభుత్వాసుపత్రిలోకి ప్రవేశ పొందగా.. ఆసుపత్రి వైద్యులు కోవిడ్ పరీక్షలు నిర్వహించగా కోవిడ్ పాజిటివ్ నిర్ధారణ కావడంతో బాధితురాలి జ్యోతికి వైద్యులు శివరాం, యశోదలు పలు సలహాలు, సూచనలు సూచిస్తూ ఆమెకు డెలవరీ నిర్వహించారు. కోవిడ్ సోకిన బాధితురాలికి వైద్యులు డెలివరి నిర్వహించి తల్లి, పాపను క్షేమంగా కాపాడటంతో పలువురు వైద్యులను అభినందించారు. వైద్య చికిత్సలో డాక్టర్ స్వర్ణలత, నర్సు ప్రసన్నకుమారి, సిబ్బంది శ్రీను, లక్ష్మణ్‌లు పాల్గొన్నారు.

## డిప్యూటి తహాసిల్దార్ వెంకటేష్ సస్పెండ్

**ఉత్తర్వులు జారీ చేసిన జిల్లా కలెక్టర్ పి. ఉదయ్‌కుమార్**

**నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 03 ప్రభాతవార్త :** ఈనెల 1వ తేదీన 230 క్వింటాళ్ల బరువున్న 460 బస్తాల పిడిఎస్ బియ్యాన్ని ఎపి 22 వి 6789 వాహనంలో అక్రమంగా తరలిస్తుండగా పౌరసరఫరాల అధికారులు సీజ్ చేసి విచారణ చేయగా ఎంఎల్ఎస్ పాయింట్ అధికారి, డిప్యూటి తహాసిల్దార్ ఎ. వెంకటేష్, ఇతర ప్రైవేట్ వ్యక్తులతో కలిసి ప్రజా పంపిణీ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారని నివేదికలో తేలడంతో జిల్లా కలెక్టర్ శనివారం అతన్ని విధుల నుండి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రాథమిక నివేదిక ఆధారంగా ఎ. వెంకటేష్ నాయబ్ తహాసిల్దార్‌ను విధుల నుండి సస్పెండ్ చేయడం జరిగిందని, ముందస్తు అనుమతి లేకుండా ప్రధాన కార్యస్థానం వదిలి వెళ్లడానికి వీలు లేదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని కలెక్టర్ హెచ్చరికలు జారీ చేశారు.

## మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్సీ, జెడ్పీ వైస్ చైర్మన్‌లు

**కల్వకుర్తి,సెప్టెంబర్03,ప్రభాతవార్త:** కల్వకుర్తి నియోజకవర్గంలోని మాడ్గుల మండలం



నర్సాయపల్లి, కొల్కులపల్లి గ్రామానికి చెందిన మమత, మౌనికలు ఇటీవల ఇబ్రహీంపట్నం ప్రభుత్వాసుపత్రిలో నిర్వహించుకున్న కు.ని ఆపరేషన్లు వికటించి మృతి చెందడంతో శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా జెడ్పీవైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్‌తో కలిసి ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాధితుల పిల్లలకు తమ విద్యా సంస్థల ద్వారా ఉచిత విద్యను అందిస్తానని ఎమ్మెల్సీ హామీ ఇవ్వడంతో బాధిత కుటుంబ సభ్యులకు రూ.10వేల చొప్పున ఆర్థిక సహాయం అందించారు. అదే విధంగా ఇర్విన్ గ్రామానికి చెందిన లాలయ్యకు మంజూరైన రూ.28వేలు, నల్లచెరువు గ్రామానికి చెందిన విజయేందర్‌కు మంజూరైన రూ.34వేలు, గిరికొత్తపల్లి గ్రామానికి చెందిన ఎ.జంగయ్యకు మంజూరైన రూ.20వేల సీఎం సహాయ నిధి చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు మాడ్గుల మండలంలో అందించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శంకర్‌నాయక్, మండల నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, దేవయ్య, సాయిరెడ్డి, జంగయ్య, పల్లె జంగయ్య, రాములు, శ్రీకాంత్, రాములు, పాండుగౌడ్, విష్ణువర్ధన్‌రెడ్డి, సాయిరెడ్డి తదితరులు ఉన్నారు.

## మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే

**కల్వకుర్తి, సెప్టెంబర్ 03, ప్రభాతవార్త:** కల్వకుర్తి నియోజకవర్గంలోని తలకొండపల్లి మండల



కేంద్రంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో కోమటికుంట తాండకు చెందిన చిలుకమ్మ, మౌనికలు మృతి చెందారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రమాద సంఘటనను అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబాలకు అండగా ఉంటానని అధైర్య పడవద్దని సూచించారు. కార్యక్రమంలో వెల్దండ మండల టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, వెల్దండ గ్రామ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి, కౌన్సిలర్ సూర్యప్రకాష్‌రావు, స్పెషల్ నాలెడ్జ్ పర్సన్ కుడుముల మనోహర్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ సంజీవకుమార్‌యాదవ్, టీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు బావండ్ల మధు తదితరులు ఉన్నారు.

# చట్టాలపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించిన న్యాయవాదులు

**నారాయణపేట,సెప్టెంబర్ 3 ప్రభాతవార్త :** న్యాయమూర్తులు కేవలం కోర్టులకు మాత్రమే పరిమితం కాకుండా దేశంలో ఉన్న చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించి తప్పులు చేయకుండా చూసేందుకు లీగల్ సర్వీసెస్ అథారిటి ఏర్పాటు అయ్యిందని నారాయణపేట జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ అథారిటి చైర్మన్ ఎం.ఎ రఫీ అన్నారు. ప్రతిరోజు రోడ్డు ప్రమాదాలు జరిగి తప్పు చేసిన వారు శిక్షణ అనుభవించడమే కాకుండా చాలామంది రోడ్డు ప్రమాదాల్లో తమ ప్రాణాలు కోల్పోతున్నందున వాహనదారులకు, సామాన్యులకు ట్రాఫిక్ నియంత్రణ, చట్టాలపై అవగాహన కల్పించేందుకు శనివారం ఉదయం మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ, నారాయణపేట ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని కోర్టు సముదాయం నుండి వీరసావర్కర్ చౌరస్తా మీదుగా తిరిగి కోర్టు భవనానికి చేరుకున్నారు. ఈ ర్యాలీని ప్రిన్సిపల్ సెషన్స్ జడ్జితో పాటు జిల్లా ఎస్పీ ఎన్. వెంకటేశ్వర్లు, ట్రాన్స్‌పోర్టు అధికారి వీరస్వామి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్‌గౌడ్‌లు ముందుండి నడిపించారు. అనంతరం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ప్రిన్సిపల్ సెషన్స్ జడ్జి మాట్లాడుతూ నేరాలు చేసిన వ్యక్తి కోర్టులో నాయకు తెలియక తప్పు చేశాను మరోమారు తప్పు చేయను మన్నించండి అని వేడుకుంటారని, చాలా మందికి చట్టంపై అవగాహన లేక తప్పులు చేస్తుంటారన్నారు. అందుకే ప్రజలకు ముందు చట్టాలపై అవగాహన కల్పించాలని జాతీయ, రాష్ట్ర, జిల్లా మండల లీగల్ సర్వీసెస్ అథారిటీలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా ట్రాఫిక్ నియంత్రణ చట్టంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వివరించారు. చట్టం లేకుండా మనం ఉండలేమని ప్రతి ఒక్కరికి చట్టంపై అవగాహన పెంచుకోవడం చాలా అవసరమన్నారు. అతివేగంగా వాహనాలు నడపటం, హెల్మెట్ ధరించకపోవడం, మద్యం సేవించి వాహనం నడపడం, ట్రాఫిక్ నియమాలు పాటించకుండా అడ్డదారిలో ప్రయాణించడం వంటి





ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు ,మాట్లాడుతున్న నారాయణపేట జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ అథారిటి చైర్మన్ ఎం.ఎ రఫీ

వాటివల్ల ప్రమాదాలు జరుగుతాయని తెలిపారు. నారాయణపేట చౌరస్తాలో పోలీస్‌ను నియమించడం చాలా అవసరమని అక్కడ అడ్డదిడ్డంగా ప్రయాణం చేస్తూ ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారని పేర్కొన్నారు. వాహనాలు నడిపేటప్పుడు తాము నమ్మకంతో ఉంటే తప్ప వాహనం నడపవద్దని హెచ్చరించారు. అతివేగం చాలా ప్రమాదకరమని ఎవరు ప్రోత్సహించరాదని హితవు పలికారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఎస్పీ ఎన్. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నారాయణపేట జిల్లా కొత్తగా ఏర్పడిన జిల్లా అని, ఇప్పటికి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, మహిళా పోలీస్ స్టేషన్ వంటివి ఏర్పడలేదని త్వరలో ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతివ్యక్తి ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాలను తగ్గించుకోవాలని సూచించారు. లైసెన్స్ లేకుండా వాహనం నడపరాదని, ఇన్సూరెన్స్ తప్పక చేయించాలని, మద్యం సేవించి వాహనం నడపరాదని అలాంటి వాటిని గుర్తిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులకు హెల్మెట్ వేసుకోమని, సీట్‌బెల్టు పెట్టుకోమని, మద్యం సేవించి వాహనం నడపవద్దని సూచించాలని కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారి వీరస్వామి మాట్లాడుతూ 16 సంవత్సరాలు నిండని పిల్లలు ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు నడవద్దని అది నేరమని హెచ్చరించారు. 16-18 సంవత్సరాల వయసు పిల్లలకు గేర్లు లేని వాహనాలకు లైసెన్స్ ఇవ్వడం జరుగుతుందని, 18 సంవత్సరాలు నిండిన తర్వాతనే లైసెన్స్ పొందేందుకు అర్హుడన్నారు. పిల్లలకు వాహనాలు ఇవ్వవద్దని తల్లిదండ్రులను కోరారు. హెల్మెట్ ధరించడం, సీట్‌బెల్టు వేసుకోవడం, మద్యం సేవించి వాహనాలు నడపకపోవడం, ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణం చేయకపోవడం చాలా మంచిదని సూచించారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడపవద్దని, వాహనాలకు సకాలంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవడం, ఇన్సూరెన్స్ చేయించడం చాలా ముఖ్యమన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్‌గౌడ్ మాట్లాడుతూ రోడ్‌క్రాస్ ఎక్కడ పడితే అక్కడ చేయవద్దని కేవలం రోడ్‌క్రాస్ జంక్షన్ వద్ద మాత్రమే క్రాస్ చేయాలని సూచించారు. అకస్మాత్తుగా తిరగడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని హెచ్చరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సెక్రెటరీ అబ్దుల్ సలీం, డిఎస్పీ, సీనియర్ న్యాయవాదులు, న్యాయవాదులు, పోలీస్ అధికారులు, విద్యార్థులు పెద్దమొత్తంలో పాల్గొన్నారు.

# రెండవ స్టాండింగ్ కమిటి సమావేశం...

**నారాయణపేట,సెప్టెంబర్ 03 ప్రభాతవార్త :** జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ కె. వనజ ఆంజనేయులుగౌడ్ ఆధ్వర్యంలో శనివారం (గ్రామీణ అభివృద్ధి) సమావేశాలు, నాల్గవ స్టాడింగ్ కమిటి (విద్య, వైద్యసేవలు)పై నిర్వహించడం జరిగింది. సమావేశంలో ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ తెలంగాణకు హరితహారం ఎంతో ప్రతిష్టాత్మక కార్యక్రమం అని ఇందులో భాగంగా మన జిల్లాలో ఇప్పటివరకు నాటిన 30 లక్షల మొక్కలను రక్షించుకునే బాధ్యత మనందరిపై ఉందని నిర్లక్ష్యం వహించే అధికారులను ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. నాటిన మొక్కలు చాలా వరకు రోడ్డుకు దగ్గరగా ఉన్నాయని దీనికి సంబంధించి డిఆర్‌డిఓ పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బి అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. బృహత్ పల్లె, ప్రకృతి వనాలు ప్రతి మండలంలో పూర్తి చేయాలని నాటిన ప్రజలకు అందుబాటులోకి తేవాలని పిల్లలు, పెద్దలు, వయోవృద్ధులు ఆహ్లాదకర వాతావరణంలో ఉంటూ మానసిక ఉల్లాసాన్ని కలిగించాలని కోరారు. మధ్యాహ్నం జరిగిన నాలుగవ స్థాయి సంఘ సమావేశం విద్య, వైద్య సేవలు సంఘానికి జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో ఛైర్‌పర్సన్, జిల్లా విద్యాధికారి హాజరు కాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారంలో నారాయణపేట జిల్లాకు ఎన్ని రోజులు కేటాయిస్తున్నారు తెలపాలని జిసిడిఓను కోరారు. మన ఊరు మనబడి కార్యక్రమంలో భాగంగా 500ల పాఠశాలలకు గాను 174 పాఠశాలలు మొదటి విడతలో ఎన్నికైనందుకు ఎన్ని పూర్తి చేస్తారో జిడిసిఓను అడిగారు. ఈ నెలాఖరు వరకు 174 పూర్తి చేస్తామని తెలిపారు. వైద్యారోగ్యశాఖ విషయంలో అధికారి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మౌలిక వసతుల కల్పన గురించి ఆపరేషన్ థియేటర్ల గురించి, శుభ్రత వాతావరణం, మెడికల్ ఆఫీసర్లను ఆదేశించాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలో, కమ్యూనిటి హెల్త్ సెంటర్లకు వచ్చే రోగులకు సరైన చికిత్సలు అందించాలని, మన ప్రభుత్వం ఆరోగ్యశాఖకు కొన్ని కోట్లు నిధులు ఇస్తుందని ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకోవడానికి వెనుకాడమని హెచ్చరించారు. మూడవస్థాయి సంఘ వ్యవసాయం సమావేశానికి జడ్పీ ఛైర్‌పర్సన్ అధ్యక్షత వహించారు. సమావేశంలో వ్యవసాయ, పశువైద్యం, ఉద్యానవన, అటవిశాఖ, మత్స్యశాఖ, భూగర్భ జలశాఖల ప్రగతిపై చర్చించారు. జిల్లా పరిషత్ సీఈఓ జ్యోతి, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఐదవ స్థాయి సంఘం సమావేశంలో స్త్రీ, శిశు సంక్షేమంపై నర్వ జడ్పీటిసి జ్యోతి అధ్యక్షత నిర్వహించడం జరిగింది. సమావేశంలో ఉట్కూర్ జడ్పీటిసి అశోక్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో కో ఆప్షన్ సభ్యులు తాజుద్దిన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ ఛైర్‌పర్సన్

# రాష్ట్ర స్థాయిలో పతకాల పంట-డా. సోలపోగుల స్వాములు

**నాగర్‌కర్నూల్ రూరల్,సెప్టెంబర్ 03 ప్రభాతవార్త :** జిల్లా అథ్లెటిక్స్ క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో అత్యంత ప్రతిభ కనబర్చి పతకాలు సాధించారని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రెటరీ డా. సోలపోగుల స్వాములు ప్రశంసించారు. ఈనెల 2,3 తేదీలలో వరంగల్ జిల్లాలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో యూత్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చి పతకాలు సాధించిన వారు కె. శ్రీను 800ల మీటర్ల పరుగు పందెంలో రజత పతకం, కె. శ్రీను 1500 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకం, డి. సత్య లాంగ్ జంప్‌లో రజత పతకం, సుధారాణి జావెలిన్ త్రోలో స్వర్ణ పతకం, కె.శివ 3 వేల మీటర్ల పరుగు పందెంలో స్వర్ణ పతకం, ఎం. శృతి 100 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకం, 400 మీటర్ల పరుగు పందెంలో బి. తేజ కాంస్య పతకం, 100 మీటర్ల పరుగు పందెంలో ఎ. గణేష్ కాంస్య పతకం, మిడ్లెరిలేలో సుధారాణి, శ్రీనిధి, తేజ, మనిషాలు రజత పతకాలు సాధించినట్లు డా. సోలపోగుల స్వాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తమ ప్రతిభ కనబర్చిన అథ్లెట్లను అభినందిస్తూ వారికి శిక్షణ అందించిన శిక్షకులను అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు జిల్లాకు, రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయిలో పతకాలు తీసుకురావాలని అన్నారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఎల్లప్పుడు సహాయ, సహకారాలు అందిస్తుందని తెలిపారు. పతకాలు సాధించిన క్రీడాకారులను జిల్లా జాయింట్ సెక్రెటరీ పరశురాముడు, కోశాధికారి శ్రీనుయాదవ్, సభ్యులు బిక్షపతి అభినందించారు.



పతకాలు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులు

**రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో నాగర్‌కర్నూల్ జిల్లా బాలికలు ఓవరాల్ చాంపియన్ షిప్ కైవసం...** రాష్ట్రస్థాయిఅథ్లెటిక్స్‌లో 12పతకాలు,16పాయింట్లతో అండర్ -18 బాలికల విభాగంలో నాగర్‌కర్నూల్ జిల్లా ఓవరాల్ ఛాంపియన్ షిప్ కైవసం చేసుకున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రెటరీ డా.సోలపోగుల స్వాములు తెలిపారు.

# అభివృద్ధి సంక్షేమ పథకాలు చూసి ఎమ్మెల్యే ఆల వెంట ఉండండి

**-అర్హులందరికి ఆసరా పెన్షన్‌లు -గడప గడపకు సంక్షేమ పథకాలు -ఎంపిపి ఎస్. హర్షవర్ధన్‌రెడ్డి**

**చిన్నచింతకుంట,సెప్టెంబర్ 03 ప్రభాతవార్త:** ప్రజా సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ ప్రభుత్వం ముందంజలో ఉందని చిన్నచింతకుంట మండల ఎంపిపి ఎస్. హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. చిన్నచింతకుంట మండల పరిధిలోని బండర్‌పల్లి 60, లాల్‌కోట 76, పర్దీపూర్ 70 మందికి ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఆదేశానుసారం గ్రామాలలో శనివారం నిరుపేదలకు ఆసరాగా బీదలకు కొత్త పెన్షన్లు రావడం ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి కృషితో సీఎం కెసిఆర్ ఆశీస్సులతో మీ గ్రామానికి వచ్చాయన్నారు. మండలంలోని అన్ని గ్రామాలను అన్ని విధాలుగా ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అభివృద్ధి చేశారని అన్నారు. ఆ అభివృద్ధిని చూసి మనమందరం ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి వెంట ఉండాలన్నారు.ప్రతి గడప గడపకు ఏదో ఒక సహాయం చేశాడని ఆయన మేలు మన మనం మర్చిపోకూడదని, ఆయనకు రుణపడి ఉండాలన్నారు.కార్యక్రమంలో జడ్పీటిసి సభ్యులు వట్టెం రాజేశ్వరి రాము,తెరాస మండలపార్టీ ప్రెసిడెంట్ కోటరాము, ఎంపిడిఓ శ్రీనివాస్ రెడ్డి, బండర్‌పల్లి గ్రామ సర్పంచ్ సతీష్, లాల్‌కోట సర్పంచ్ సంధ్యరత్నం, పర్దీపూర్ సర్పంచ్ సుప్రియ, కోటరాము, ముచ్చింతల సింగిల్ విండో ఛైర్మన్ ఉమామహేశ్వర్‌రెడ్డి, జిల్లా రైతు సమన్వయ సమితి సభ్యులు కరుణాకర్‌రెడ్డి, ఎంపిటిసి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, స్వామి, కృష్ణారెడ్డి, నరసింహ, దస్తగిరి, కుమ్మరి నారాయణ, బాలరాజ్, ఆనంద్, ఎర్రన్న, దేవరకద్ర మార్కెట్ వైస్ ఛైర్మన్ రాము, రమేష్, శివ, కృష్ణయ్య, వెంకట్రాములు, అశోక్, మల్లేష్, వార్డు మెంబర్ రాములుగౌడ్, రాజులతో పాటు తెరాస నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పెన్షన్ ధృవపత్రాలు అందజేసిన ఎంపిపి

# వైఎస్ షర్మిల మాటలను ఖండించిన తెరాస నాయకులు

**అచ్చంపేట అర్బన్,సెప్టెంబర్ 03 ప్రభాతవార్త :** ప్రజాప్రస్థానం పాదయాత్ర పేరుతో అచ్చంపేటకు విచ్చేసిన వైఎస్ షర్మిల మాటలను ఖండిస్తూ శనివారం అచ్చంపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేఖరుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ షర్మిలకు కౌంటర్ ఇచ్చిన తెలంగాణ దళిత సంఘం నేతలు, ఎస్సీ నియోజకవర్గానికి వచ్చిన షర్మిలకు కనీసం అంబేద్కర్ విగ్రహానికి పూలదండ వేయాలనే ఆలోచన లేకుండా దళిత సమాజాన్ని అవమానపరిచిన షర్మిలకు దళితుల గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. అచ్చంపేట నియోజకవర్గ అభివృద్ధిపై కనీస అవగాహన లేకుండా మాట్లాడిన షర్మిల ఇంకోసారి మా ఎమ్మెల్యే గువ్వల బాలరాజు గురించి మాట్లాడితే సహించేది లేదని ఖండించారు. కార్యక్రమంలో తెరాస నాయకురాలు బల్మూరు గౌరమ్మ, జ్యోతి, రంగాపూర్ వెంకటయ్య, మంద వెంకటయ్య, బీసమోల్ల ఆనంద్, ముడి తిరుతపయ్య, బుద్దుల మల్లయ్య, గాలిగూటి సురేష్, రౌడంపల్లి రవి, పులిజాల మల్లేష్, గుండె మహేష్, ఇంజమూరి జగన్, కరుణాకర్, బుదుద్ల కళ్యాణ్, తెరాస నాయకులు పాల్గొన్నారు.

## ఎబివిపి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు



**రాజాపూర్,సెప్టెంబర్ 03 ప్రభాతవార్త :** రాజాపూర్ మండల కేంద్రంలో 8,9,10 తరగతుల విద్యార్థినీ, విద్యార్థులు శనివారం ఎబివిపి సభ్యత్వ నమోదు చేసుకున్నారు. మండల కేంద్రం నుండి దాదాపు 750 మంది విద్యార్థినీ, విద్యార్థులు సభ్యత్వ నమోదు చేసుకున్నట్లు మండల అధ్యక్షులు ప్రశాంత్ తెలిపారు. కార్యక్రమంలో ఎబివిపి పాలమూరు జిల్లా హాస్టల్ కన్వీనర్ హన్మగళ్ల బాల్‌రాజు, సాయికుమార్, పవన్, మణి, శశికిరణ్, మణికంఠ పాల్గొన్నారు.

## ట్రాన్స్‌కో ఏఈగా బాధ్యతలు స్వీకరించిన అప్పలనాయుడు



**లింగాల,సెప్టెంబర్ 03 ప్రభాతవార్త :** మండలంలో మెరుగైన విద్యుత్ సేవలను అందించడానికి కృషి చేస్తానని ట్రాన్స్‌కో ఏఈ అప్పలనాయుడు అన్నారు. బల్మూరు నుండి బదిలీపై వచ్చిన అప్పలనాయుడు ఏఈగా లింగాల విద్యుత్ సబ్ స్టేషన్‌లో శనివారం బాధ్యతలను స్వీకరించారు. లింగాలలో పని చేస్తున్న ట్రాన్స్‌కో ఏఈ బల్మూరుకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఆయనను లైన్ ఇన్స్‌పెక్టర్లు నిరంజన్‌గౌడ్, శ్రీను, లైన్‌మెన్ లింగం, బాలస్వామి, జెఎల్‌ఎంలు ఖాజా, కాశన్న, మధు, భాస్కర్, దేవేందర్‌లు సన్మానించారు.

## కౌకుంట్లలో ఘనంగా వినాయక నిమజ్జనం



**దేవరకద్ర రూరల్,సెప్టెంబరు 03 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలం కౌకుంట్లలో శనివారం వినాయక నిమజ్జనాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని నేతాజినగర్‌లోనున్న ఏదుల పుష్ప లత ప్రతిష్ఠించిన వినాయకుడిని నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా వినాయకుడి ఊరేగింపును సర్పంచ్ స్వప్న కిషన్‌రావు ప్రారంభించారు. వినాయకుడి నిమజ్జనం సందర్భంగా నిర్వహించిన లక్కిడీప్‌లో సర్పంచ్ స్వప్న కిషన్‌రావు కుమారుడు అభిరామ్ లడ్డూను గెలుపొందడం జరిగింది. ఈ కార్యక్రమంలో గణేష్ ఉత్సవకమిటీ సభ్యులు,మహిళలు,యవకులు,గ్రామస్థులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రత్యేక పూజల్లో ఎన్‌ఆర్‌ఐ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

**వెల్దండ, సెప్టెంబర్ 03, ప్రభాతవార్త:** వెల్దండ మండల పరిధిలోని పెద్దాపూర్ గ్రామంలో యువశక్తి ఆధ్వర్యంలో ప్రతిష్టించిన వినాయకుడి వద్ద ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, ఎన్‌ఆర్‌ఐ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొని పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమానికి విచ్చేసిన ఎన్‌ఆర్‌ఐని నిర్వాహకులు,గ్రామస్తులుపూలమాలలు,శాలువాలతో ఘనంగా సన్మానించి తీర్థప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో రాజు, శ్రీకాంత్‌రెడ్డి, ఫౌండేషన్ సభ్యులు రమేష్‌నాయక్, శ్రీనివాసులు, కొండల్, రాంచంద్రయ్య,వెంకటేష్‌తోపాటు తదితరులు ఉన్నారు.

## నేతాజీ యువజన సంఘం అద్వర్యంలో అన్నదానం

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్, 3, ప్రభాతవార్త:** నేతాజీ యువజన సంఘం అద్వర్యంలో వినాయక మండపంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.మూసాపేట మండల కేంద్రంలోని గాంధీ విగ్రహం సమీపంలో ఏర్పాటు చేసిన వినాయకుడికి సామాజిక కార్యకర్త,నేనుసైతం స్వచ్చంద సంస్థ అధ్యక్షులు దిడ్డి ప్రవీన్ కుమార్ ప్రత్యేక పూజలను కుటుంబ సభ్యులతో కలిసి చేశారు. అనంతరం అన్నదానం కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో మూసాపేట,నిజాలపూర్ గ్రామస్తులు పాల్గొన్నారు,నేతాజీ యువజన సంఘం అధ్యక్షులు నవీన్,క్యావర్గం శేఖర్,శ్రావణ్, సలాం,పాషా,రాజు,ఖాదర్,అనిల్,శ్రీకాంత్,అరవింద్,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ల్యాప్‌టాప్ బహూకరణ

**కల్వకుర్తి, సెప్టెంబర్ 03, ప్రభాతవార్త:** కల్వకుర్తి మండలం పంజుగుల గ్రామానికి చెందిన సింగపాకుల వంశీ ఇటీవల ఒక ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం సాధించాడు. ఉద్యోగం చేయాలంటే పర్సనల్ ల్యాప్‌టాప్ అవసరం ఉండటంతో ల్యాప్‌టాప్ కొనలేని ఆర్థిక పరిస్థితి ఉండటంతో విషయం తెలుసుకున్న టీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు బావండ్ల మధు ఉదార స్వభావంతో ముందుకొచ్చి వంశీకి ల్యాప్‌టాప్ బహుకరించి ఉద్యోగానికి సహకరించారు. వంశీతో పాటు అతని కుటుంబ సభ్యులు బావండ్ల మధుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.